కథ

# కిష్కింధ కాండ

చందు తులసి
99855 83022

“ప్రాకారముల బద్దలు చేసి, ద్వారబంధముల ధ్వంసము చేసి సుందరమైన అశోకవనమును.. చిందరవందర చేసేను మారుతి.. శ్రీహనుమాను గురుదేవులు నా యెద పలికిన సీతారామ కథ.. నే పలికెద సీతారామ కథ!''..

హనుమంతుడు లంకా దహనం ఎలా చేశాడో వర్ణిస్తూ.. సుందరకాండ ఆలపిస్తున్న ఎం.ఎస్. రామారావు గొంతు రాములవారి గుడి మైక్ లోనుంచి ఊరంతా వినిపిస్తోంది. రోజూ ఆ పాటలు వినపడగానే నిద్రలేవడం ఆ ఊరి జనానికి అలవాటైపోయింది. అందరిలాగే ఎంకన్న కూడా లేచి.. సగం నిద్ర మత్తులోనే నడుచుకుంటూ కొట్టంలో ఉన్న ఆవులకు మేతవేయడానికి పోతున్నాడు.

ఇంతలోనే ఒక్కసారిగా ఆకాశంలో హఠాత్తుగా ఉరిమి, పిడుగు పడ్డట్టు.. ‘దమ దమ దమ’.. అంటూ వాళ్ల రేకుల ఇంటిపైన పెద్ద చప్పుడు. అంతకుముందే నిద్రలేచి ఇంటిపని చేసుకుంటున్న ఎంకన్న భార్య, ఇంకా నిద్రలేవని ఇద్దరు పిల్లలే కాదు, చుట్టుపక్కల జనం కూడా.. ఉలిక్కిపడ్డారు.

ఆ రేకుల ఇంటిపైనుంచి గుంపులు గుంపులుగా పోతున్న కోతులు. ‘కిచ కిచ కిచ.. కీర్ కీర్’.. అంటూ నలభై, యాభై కోతులు ఒక ఇంటిమీది నుంచి ఇంకో ఇంటిమీదికి దుంకుతున్నాయి. అలా దుంకుతున్నపుడు వీధి దీపం వెలుగులో.. పెద్దగా, పొడుగ్గా సాగినట్లు ఉన్న ఆ నీడలు.. కోతుల నీడలు భయంకరమైన దయ్యాల్లాగా కనిపించాయి.

‘‘తెల్లారక ముందే ఊరిమీద పడ్డాయిరా కోతుల మంద..'' అని తిట్టుకుంటూ పెద్ద వెదురు కట్టె పట్టుకుని..

‘హోయ్, హోయ్’.. అంటూ ఎంకన్న వాటిని తరమసాగాడు. చుట్టుపట్టు జనం కూడా పెద్దపెద్ద గిన్నెలు, రేకు డబ్బాలు కొడుతూ.. భయంకరమైన శబ్దం చేస్తూ.. తరుముతున్నారు.

కోతులు ఏమాత్రం భయపడకుండా.. ఒక ఇంటి గాబు దగ్గర ఉన్న ఎంగిలి గిన్నెలు, రాత్రి మిగిలిన అన్నం కోసం వంటపాత్రలు.. ఏది దొరికితే అది అందుకుని ఉరుకుతున్నాయి. కేబుల్ టీవీ వైర్లమీద ఊగుతూ, ఎగురుతూ, దూకుతూ.. అల్లకల్లోలం చేసి ఇంకో బజారువైపు పారిపోయాయి. ఒక పెద్ద యుద్ధం ముగిసినట్టు ప్రశాంతంగా ఉంది అక్కడ.

❖ ❖ ❖



ఎంకన్నకు నలభై ఏళ్లు ఉంటాయి. తండ్రి ఇచ్చిన మూడెకరాల భూమిని సేద్యం చేసుకుంటూ బతుకుతున్నాడు. పగలు, రాత్రి వ్యవసాయమే లోకంగా పచ్చని చెట్టులా బతుకుతున్నాడు. భార్య ఎల్లమ్మకు కూడా చేను తప్ప ఇంకో ముచ్చట తెలియదు. ఈ కోతుల గోల లేకముందు.. అంటే, ఐదేళ్ల కిందట.. ఎకరం వరిపొలం, ఇంకో ఎకరం పత్తి, మరో ఎకరం వేరుశనగ పంట సాగుచేసేవాళ్లు. ఈ కోతుల గోల మొదలై నాలుగేళ్లు అయింది. ఏ పంటను దక్కనిస్తలేవు. వేరుశనగ చేనులో.. పిందెలు పడకముందే ఒక్క రాత్రిలో చేను మొత్తం పీకిపారేస్తయి. పత్తి చెట్లు పిందెలను పీక్కతింటయి. ఆఖరికి వరిపొలాన్ని కూడా కొరికికొరికి తింటున్నాయి. వీటిని ఎట్ల వదిలించుకోవాల్నో అర్థం కావట్లేదు ఎంకన్నకు.

ఎంకన్న వాళ్ల ఊరి పక్కనే ఉన్న నది మీద.. పెద్ద డ్యాం కట్టడానికి పనులు చురుగ్గా జరుగుతున్నయి. పెద్ద కొండను బాంబులు పెట్టి పేలుస్తున్నరు. పొక్లెయినర్లతో కాలువలు తవ్వుతున్నరు. చీమల బారులా నిత్యం రోడ్లమీద భారీ లారీలు, టిప్పర్లు. ప్రాజెక్టు పని అయిపోతే.. తమ ఊరితోపాటూ చుట్టుపక్కల ఊళ్లకు నీళ్లు వస్తాయని.. భూముల ధరలు పెరుగుతాయని సంబరపడుతున్నారు రైతులు. ఎంకన్నకు మాత్రం ప్రశాంతంగా అడవిలో బతికే కోతులు ఈ ప్రాజెక్టు వల్లనే.. ఊళ్ల మీదపడ్డాయని కోపంగా ఉంది.

ఎంకన్న చిన్నతనంలో కోతులు ఇంతగనం ఉండేవి కాదు. ఎప్పుడో ఒకసారి దారితప్పినట్టు కోతులు ఊళ్లోకి వచ్చేటియి. ఆ రోజుల్లో కోతి అంటే అదో ఇచ్చిత్రం. అట్లనే గారడీ చేసేటోళ్లు కూడా.. ఊళ్లో కోతిని ఆడించేటోళ్లు. కోతికి ఒక సద్దిమూట ఇచ్చి..

‘నీ మొగనికి సద్ది తీసుకుని పో!’ అని చెప్తే.. అది ఊరి పెద్దమనిషి ఒకాయన్ని గట్టిగా పట్టుకునేది. దాన్ని చూసి పోరగాళ్లు చప్పట్లు కొడుతూ పకపకా నవ్వేటోళ్లు. కానీ ఇప్పుడు.. కోతుల్ని చూస్తే దయ్యాల్ని చూసినట్టే జనం భయపడుతున్నరు.

పంట చేల మీదనే కాదు.. ఊరి మీదకూడా దాడి చేస్తున్నయి. పండుగ పూట అప్పలు చేయడానికి డాబాల మీద ఆరబెట్టిన బియ్యం, శనగపప్పులు కానీ కోతుల కంట్లో పడితే.. ఇంక ఆశ వదులుకోవాల్సిందే. నిమిషంలో మాయం చేస్తయి. కావలి ఉన్న చిన్నపిల్లలను, ఆడోళ్లను కూడా భయపెడతయి. ఓపాలి ఇంటి ముందర బియ్యం చెరుగుతున్న.. సాకలోల్ల శాంతమ్మ మీదపడి శాటెడు బియ్యం ఎత్తుకొని పోయినయి. అంతెందుకు కుమ్మరోల్ల లక్ష్మమ్మ ఇంట్లె.. నానబెట్టిన బియ్యం గిన్నె కూడా ఎత్తుకొని పోయినయి. మంగలోళ్ల భాగ్యమ్మ.. ఇంటికి తాళం వేసుకుని చేను కాడికి పోతే.. కిటికీలు నెట్టి లోపలకి జొరబడి ఇల్లు మొత్తం అల్లదంతల్లడం చేసినయట. దొంగలు పడ్డరేమో అని